# కరివేపాకు

కరివేపాకును పరిస్థితులను బట్టి నీటి పారుదల పంటగా, నీరు లేనపుడు మెట్ట పొలాల్లో వర్షాధార పంటగా సాగుచేయవచ్చు. ఇది నిలువుగా పెరిగే బహు శాఖీయ, బహువార్షిక పొద. దీని ఆకులు మంచి సువాసన కలిగి వుంటాయి. కరివేపాకు దక్షిణ భారత వంటకాల్లో తప్పకుండా ఉపయోగిస్తారు.

**వాతావరణం :** 26-37$^0$ సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత మరియు 15$^0$ సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత అవసరం. నీరు ఎక్కువయితే తట్టుకోలేదు.

**నేలలు :** నీరు నిలవని తేలికపాటి గరపనేలలు. నీరు నిలిచే నల్లరేగడి భూములు సాగుకు పనికిరావు. మురుగునీటి పారుదల వసతిగల ఎర్రగరప నేలలు, ఒండ్రు నేలలు మంచివి.

**విత్త సమయం :** జూలై – ఆగష్టు

**రకాలు**

**దేశవాళీ రకాలు :** ముదురు ఆకుపచ్చ రంగు గల ఆకులు, కాడలు కలవి. లేత ఆకుపచ్చ రంగు గల కాడలున్నవి.

**సువాసిని :** వేరు మొక్కల ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుంది. మెట్టప్రాంతానికి అనుకూలం.

**భువనేశ్వర్ :** నీటి పారుదల ప్రాంతాల్లో ఎక్కువగా సాగుచేయబడుతుంది.

**సెంకంపు :** ఈ రకము తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లాలోని కరమాడై ప్రాంతంలో పండించబడే రకము. ఆకు కాడ ముదరు ఎరుపు రంగులో వుండును. ఆకు ఎక్కువ నూనెశాతం మరియు సువాసన కలిగి వుండును.

**నారుపోయటం :** ఎకరానికి 250 కిలోల కాయలు లేదా 80-100 కిలోల విత్తనాలు సరిపోతాయి. విత్తనాలను సేకరించి వెంటనే విత్తుకోవాలి. ఆలస్యంగా నాటుకుంటే మొలకశాతం తగ్గుతుంది. నారుమడులు(1మీ×1మీ. విస్తీర్ణంలో, 15 సెం.మీ. ఎత్తుతో) తయారుచేసి వరుసల్లో 10 సెం.మీ. ఎడంతో విత్తనాలను విత్తుకోవాలి. గడ్డి కప్పి రోజుకు రెండుసార్లు నీటిని చల్లాలి. 15-20 రోజులకు విత్తనాలు మొలకెత్తుతాయి. 3 నెలల వయస్సు గల మొక్కలను పొలంలో నాటుకోవాలి.

**నేల తయారి :** నేలను 4-5 సార్లు బాగా దుక్కి వచ్చే వరకు దున్నాలి. ఎకరాకు 8 టన్నుల పశువుల ఎరువుతో బాటుగా 26 కిలోల నత్రజని, 9 కిలోల భాస్వరం మరియు 9 కిలోల పొటాష్ వేయాలి. నారు నాటటానికి ముందుగా 30×30×30 సెం.మీ. గుంతలను 1.2-1.5 మీ. దూరంలో, దుబ్బునేలల్లో అయితే 90×90 సెం.మీ. దూరంలో తీయాలి. 6 నెలల తర్వాత రెండవదఫా 8 కిలోల నత్రజనిని వేయాలి. కార్శీ పంటలకు రెండవ సంవత్సరంలో 8 కిలోల నత్రజని, 20 కిలోల చొప్పున భాస్వరం, పొటాష్ ఎరువులు వేసుకోవాలి. ప్రతి మొక్కకు 20 కిలోల పశువుల ఎరువు వేయాలి.

**నీటి యాజమాన్యం :** మొక్కలు నాటిన వెంటనే బోదెల ద్వారా నీరు పెట్టాలి. వారానికి ఒకసారి నీటిని ఇవ్వాలి.

**అంతరకృషి మరియు అంతరపంటలు :** పప్పుధాన్యాలను, ఆకు కూరలను అంతరపంటలుగా పిండించవచ్చును. 1మీ. ఎత్తు పెరిగిన తర్వాత మొక్క చివర్లను తుంచి వేయడం వల్ల ప్రక్క కొమ్మలతు ఎక్కువగా వచ్చి గుబురుగా పెరుగుతుంది. కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసి నాశనం చేయాలి.

**సస్యరక్షణ :** గొంగళి పురుగులు ఆకులను తిని నష్టపరుస్తాయి. నివారణకు మలాథియాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పొలుసు పురుగులు కాండంపై చేరి రసాన్ని పీల్చివేస్తాయి. మొక్క పెరుగుదల తగ్గిపోతుంది. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. పిచికారి చేసిన తర్వాత 10 రోజుల వ్యవధి ఇచ్చి ఆకుకోయాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు 1గ్రా. కార్బండైజిమ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**దిగుబడి మరియు కోత కోయటం :** మొదటి సంవత్సరంలో నాటిన 10-12 నెలల్లో కోతకు వస్తుంది. ఎకరాకు 100-160 కిలోల దిగుబడి నిస్తుంది. రెండవ సంవత్సరంలో ప్రతి 4 నెలలకు ఒకసారి 700 కిలోల చొప్పున ఎకరాకు మొత్తం 2100 కిలోల దిగుబడి వస్తుంది. మూడవ సంవత్సరంలో 2100 కిలోల దిగుబడి వస్తుంది. నాల్గవ సంవత్సరంలో ప్రతి 3 నెలలకు ఒక కోతకు 2000 కిలోల చొప్పున సంవత్సరానికి ఎకరాకు 8,000 కిలోల చొ॥న దిగుబడి వస్తుంది.

**నిల్వ :** ఆకును ఎండబెట్టి, పొడిచేసి నిల్వ చేసుకొనవచ్చును. ఎండబెట్టిన ఆకును కూడ కొన్ని రోజుల వరకు రోజు వారి కూరలు, పచ్చళ్ళలో వాడుకొనవచ్చును.

కరివేపాకు సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన చిరునామా **251వ** పేజీలో ఇవ్వబడింది.